
# అడ్డుగోడలు



" హౌస్ ఓనర్ రంగారావంటే  మీరేనా? అంటూ ఓ అపరిచిత వ్యక్తి మరొకరితో కలిసివచ్చి గుమ్మంలో నిలుచున్నాడు. రంగారావు వారి వేషభాషలు గమనించాడు. ఒక చేతిలో సెల్‌ఫోన్, ఆ చేతి వేళ్లకే మూడు ఉంగరాలు, మరో చేతిలో లావుపాటి డైరీ, కంటికి నల్ల కళ్ళద్దాలు, మెడలో గోల్డ్ చెయిన్, ఆ ఇద్దరు ఎంతో అహంభావమున్న వ్యక్తుల్లా కనిపించారు.

" ఆ అవును మీరెవరు? అనుమానాస్పదంగా అడుగుతూ ఐరన్ గ్రిల్స్‌కున్న గొళ్లెం తీస్తూ, లోనికి పిలిచాడు.

" మేం బిల్డింగ్ కాంట్రాక్టర్లం. డెవలప్‌మెంట్ కోసం ఓల్డ్ హౌసెస్ అన్నీ సర్వే చేస్తున్నాం. మీ ఇల్లు చూసి వచ్చాం." అంటూ  ఇంటి వాసాలు లెక్కపెట్టే విధంగా కలియచూడసాగారు.

రంగారావు ఆత్మాభిమానం దెబ్బతిన్నవాడిలా ముఖం చిట్లించాడు.

తామేదో గతిలేక ఇల్లు అమ్మకానికి పెట్టినట్లు ఆ ఇద్దరు బేరసారాలాడుతూ కొనుక్కునే పెద్దమనిషిలా కనిపించడం రంగారావుకి ఎంతో నామోషీలా తలకొట్టేసినట్లనిపించింది.

"సారీ! డెవలప్‌మెంట్స్‌కిచ్చే ఉద్దేశం లేదు" అన్నాడు రంగారావు ఖరాఖండీగా అభ్యంతరం తెలుపుతూ.

" అది కాదుసార్, ఓల్డ్ బిల్డింగ్ కదా మాకిచ్చారనుకోండి. మీకు మళ్ళీ నీటుగా అపార్ట్‌మెంట్స్ నిర్మిస్తాం. ఇంకా నగదు రూపంలో కొంత క్యాష్ ముట్టచెపుదాం. చాలామంది అలాగే చేస్తున్నారు. చెప్పడం మావంతు. ఆపై మీ ఇష్టం." అంటూ చెప్పాలనుకున్న నాలుగు ముక్కలు చెప్పేసి బయటపడడానికి సిద్ధమవుతూ లేచి " అడ్రస్సు సెల్‌నెంబరున్న విజిటింగ్ కార్డు అందించి వెళ్లిపోయారు.

అపరిచితులు అకస్మాత్తుగా వచ్చి తనకి ఉదారంగా లక్షలు సమర్పించాలనుకోవడం రంగారావుకి వింతగా, అయోమయంగా తోచింది. ఒళ్లంతా గగుర్పొడిచింది. గదిలోకి వెళ్లేసరికి అప్పటివరకు పిల్లలిద్దరూ చూస్తున్న టివి ఛానల్ ప్రోగ్రాం సందడి ఆగిపోయింది.

రంగారావు భార్య భాగ్యం వంటగది తలుపులు వేస్తూ కొంగు బిగించుకొని వడివడిగా పెద్ద గదిలోకి వచ్చింది.

అందరిలో కనిపించిన ఆతృతని, అప్పటికే ఆ గదిలో పేరుకుపోయిన నిశ్శబ్దాన్ని భరించలేక కుర్చీలో కూర్చొని నోరు విప్పాడు రంగారావు.

"ఎవరో బిల్డరట. అపార్ట్‌మెంట్ కోసం మనిల్లు అడుగుతున్నాడు. డెవలప్ చేస్తాడట" అన్నాడు. సందిగ్ధంగా ఏ విషయమూ వివరంగా చెప్పకుండా.

" అయితే మీరేమన్నారు' ఉత్సాహంగా కొడుకు రవి, కూతురు రమ్య పోటీపడుతూ అడిగారు.

" ఏమాత్రం ఇచ్చేది లేదన్నాను. మీ తాతగారు నాకు, కొంత పోర్షన్ మీ పెద్దనాన్నకు జత చేసి రాశాడు. అయినా ఇప్పుడింత అవసరం లేదని చెప్పి పంపించేశాను." అన్నాడు రంగారావు సావధానంగా.

" అదేంటిడాడీ మీరు మరీ చాదస్తంగా మాట్లాడుతున్నారు. అవసరం లేదంటారేమిటి?"

అంటూ కొడుకు రవి కొంచెం కఠినమైన గొంతుకతో పలికే సరికి రంగారావు

అయాయకంగా భార్య వైపు చూశాడు.

" అబ్బాయన్నది కరెక్టే. అవసరం లేదని ఎలా అనుకుంటున్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మాటిస్తే బాగుంటుంది." అంది భాగ్యం సౌమ్యంగా.

" డాడీ బిల్డర్ మనకేమిస్తామన్నాడో చెప్పండి" అని అడిగింది రమ్య మధ్యలో కల్పించుకుంటూ.

" ఆ వాళ్లెన్నాన్నా చెపుతారు. అపార్ట్‌మెంట్స్‌తో పాటు క్యాష్ కూడా ఇస్తామన్నారు.

" క్యాష్ కొంతకాదు బాగానే" రవి గ్యాప్ పూర్తి చేశాడు. బిల్డరు అన్నమాటలు తను బాగా విన్నాను సుమా అన్నట్లు.

" ఆ మాటే బిల్డరు అన్నప్పుడు, చెరొక మూడు బెడ్ రూమ్స్ మీకు, మీ అన్నయ్యకు అడుగుతూ ఆపైన ముప్ఫై లక్షలు క్యాష్ ఇమ్మంటే సరి" అంది భాగ్యం పంపకాలు బాగా తెలిసిన వ్యక్తిలా, మరింత గడుసుగా.

" వెరీగుడ్, మమ్మీ చాలా బాగా చెప్పావ్" చెల్లి పెళ్లికి ఓ అపార్ట్‌మెంట్‌తోపాటు పది లక్షలు కట్నం ఆఫర్ చేస్తే ఏ డాక్టరో, ఇంజనీరో వస్తాడు. పెళ్లి కూడా ఘనంగా చేయొచ్చు". " ఎంతో కుతూహలపడుతూ తనకెంతో బాధ్యత ఉన్నవాడిలా అభినయిస్తూ అన్నాడు రవి.

" అన్నయ్యా! డాడీ నీకేం తక్కువ చేయడులే. అమెరికా ప్రయాణానికి పది లక్షలన్నా రెడీ చేస్తారు. అవును కదా డాడీ" అంటూనే.

" అంతేకాదు, మన స్టాటస్‌కి ఓ కారన్నా లేకపోతే ఎలా." అంది తన కోరికను అంతూపొంతూ లేన దానిలా రమ్య.

" అబ్బబ్బ! ఉండండ్రా! ఏమిటి మీ గొంతమ్మ కోరికలు. మీ డాడీ ఏమంటారో వినండి "అంది భర్త ఉదాసీన వైఖరిని గమనిస్తూ భార్య.

" పోన్లేవే వాళ్ళ ఆశల్ని, కోరికల్ని ఎందుకలా కొట్టి పారేస్తావ్. ఏమో నిజంగానే ఆ బిల్డర్ అలాగే అన్నాడనుకో, అప్పుడు వాళ్లాశించినవి నిజం కాకుండా పోతాయా పిల్లల ఆరాటాన్ని, ఆర్భాటాన్ని తనెందుకు ఆటంకపరచాలన్నట్లు ఆ మాటకు భాగ్యం ఒకింత ఆశ్చర్యపడినా, అంతలోనే తమాయించుకొని భర్త కోరిక కూడా అదే అయినప్పుడు అంతకన్నా అదృష్టమింకేముంటుందని సంబర పడింది. మనం మాత్రం సుఖపడక

పోతామా?" అన్నాడు రంగారావు మరింత ఆనందంగా

రవి, రమ్య వేర్వేరు చోట కూర్చొని ఊహల పల్లకిలో ఊరేగుతూ కలల రాజ్యంలో తమ తమ కోరికలు తీరితే ఎంత ఆనందం పొందొచ్చో ఊహించుకోసాగారు. ఇంత కాలం చాలీచాలని ఓల్డ్‌హౌస్‌లోనే సర్దుకుంటూ తండ్రి తెచ్చిన అత్తెసరు ఆదాయంతో కాలంగడుపుతూ ఈ గృహమే కదా స్వర్గసీమగా తలచి ఎంతో ఆత్మవంచన చేసుకోవడం. స్నేహితులు, బంధువులంతా వారి వారి అంతస్తులకు తగ్గ హుందా, హోదా కనపరుస్తుంటే అసలీ జన్మకు మనమాస్థాయికి చేరుకుంటామా అని భావిస్తున్న సమయంలో అందరికన్నా ఒక మెట్టుపైకి ఎదిగి, సమృద్ధిగా, హోదా ఒలికించే సదావకాశం ఇప్పుడొచ్చింది. అదే చాలన్నట్లు ఇద్దరు ఆనందడోలికలలో కలల పరిష్వంగంతో ఊగుతూ ఆ రాత్రి ఎలా తెల్లవారిందో అర్థం కాలేదు. ఉదయాన్నే భాగ్యం నిద్రలేచి పెరట్లోకి వెళ్లి పూలన్నీ కోస్తూ 'అయ్యో! ఇంత చక్కనిపూల మొక్కల్ని నిర్దాక్షిణ్యంగా కాంక్రీటులో పూలతో పూడ్చి పెట్టి కప్పేస్తారు. తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తోంది". క్షణం పాటు మనసు దు:ఖంతో కొట్టుమిట్టాడింది. అదే వేళకు రంగారావు పాత సామానులన్నీ తెరిచి సర్దుతుంటే, "ఏం చేస్తారు వీటిని" అంటూ భాగ్యం వచ్చి అడిగింది.

"సెకెండ్" హేండ్‌కిచ్చేస్తే మంచిది కదా, బిల్డరు ఎప్పుడొచ్చి ఖాళీ చేయమంటాడో మరి" అంటూ కళ్లెగరేశాడు రంగారావు. ఆ మాటకు సన్నగా నవ్వింది భాగ్యం.

ఆ రోజు గడిచిందో లేదో ఎక్కడెక్కడున్న స్నేహితులు, బంధువులు పరామర్శకు రావడం, మరోపక్క ఫోన్లో పలకరింపులు. " అపార్ట్‌మెంట్‌కిచ్చేస్తారా లక్షలే దొరుకుతాయి. మీ పనే బాగుంది "అంటూ ఆ మాటల్లో ఎగతాళో, వెక్కిరింపో, అభినందనో అర్థం కానట్లు పొగడ్తల వర్షం కురిపించసాగారు.

ఆ మర్నాడు బిల్డరొచ్చి తన ప్రపోజల్ మరోమారు గట్టిగా చెప్పి వెళ్లాడు.

మూడో రోజున రంగారావు పంపిన కబురందుకొని అన్నయ్య ఈశ్వర్ భార్యను, పిల్లల్ని వెంటబెట్టుకొచ్చాడు. వారి ముఖాల్లో, మాటల్లో ఏదో తేడా, వెలితి కొట్టకొచ్చినట్లు కనిపించింది రంగారావుకి. బిల్డరు, అసిస్టెంట్స్ కాంట్రాక్టరుతతో కలసి సెటిల్‌మెంట్‌కి వచ్చాడు. ఈశ్వర్ తన తండ్రి రాసిన వీలునామా మరోమారు చదివి పెదవి విరిచాడు. ఏదో లోటు, లోపం కనిపించినట్లు ముఖం వేలాడదీశాడు. తండ్రి బతికి ఉన్నంతకాలం, చివరి క్షణం వరకు చేసిన నిస్వార్థసేవకు రంగారావుకి మూడొంతులు. ఈశ్వర్‌కి మిగిలింది తన ఆస్తి వాటా వేస్తూ వీలునామాలో రాశారు.

ఈశ్వర్ మనస్సంగీకరించలేదు. పెద్దవాడిగా తనకి మూడొంతులు కావాలని పట్టుబట్టాడు. ఆ మాటకు భార్యాపిల్లలు కూడా మద్దతు పలికారు. పంతాలు, పట్టుదలలు పెరిగాయి. రంగారావు కుటుంబం మాత్రం ఇది అన్యాయమంటూ ధ్వజమెత్తారు. అందరిలో పౌరషం తారాస్థాయికి చేరింది. ఒకన్నొకరు దుర్భాషలాడుకుంటూ దెప్పిపొడుచుకుంటూ దుయ్యబట్టుకున్నారు. కీచులాటలు, తోపులాటలు, ఛీత్కారాలతో వాతావరణం వేడెక్కుతున్న సమయంలో రంగారావు విలయతాండవం చేసిన వాడిల ఉగ్రుడై. పిచ్చికోపంతో గట్టిగా కేకలు పెడుతూ పరిస్థితిని సద్దుమణిగేటట్లు చేశాడు. ఆస్తికోసం రెండు కుటుంబాలు వీధిన పడటం రంగారావుకి ఎంతమాత్రం మనస్కరించలేదు. ఓర్పు, సహనం కోల్పోయినవాడిలా కీచగొంతుతో " స్టూపిట్, ఏమిటీ న్యూసెన్స్ పరువు మర్యాదు లేనివాళ్లల బిహేవ్ చేయడమేమిటి?అంటూ ఒక క్షణం ఆగి

" "బిల్డరు గారు దయచేసి ఆ అగ్రిమెంట కాగితాన్ని చించిపారేసి, ఇక్కడ్నుంచి వెళ్లిపోండి" మాకు శాంతి కావాలి. మీరిచ్చే అపార్ట్‌మెంటూ వద్దు, లక్షలు అసలొద్దు. మాక్కావలసిం అప్యాయత, అనురాగం, మీ వద్ద లేవు. ప్లీజ్ వెళ్లిపోండి" అంటూ అసహనం కోల్పోతున్నట్టు గట్టిగా అన్నాడు. ఊపిరి స్తంభించిందా అన్నట్లు నిశ్శబ్దం చోటుచేసుకుంది.

బిల్డరు అందరి వంక చూశాడు. "సార్? మీరన్నది నిజమే కావచ్చు. ఎవరి వాటా వారు పంచుకోనంతకాలం మీ మధ్య ఈ గొడవలు, మనస్పర్థలు ఇలాగే ఉండిపోతాయి. ఆలోచించండి" అన్నాడు.

" బాగా చెప్పారు. ఇంతకాలం మమతలు, మమకారాలు, బంధుప్రీతి మాలో వున్నాయని అపోహపడ్డాను. నరనరాల్లో స్వార్థం, అసమానతలు మాలో ఎంతగా పేరుకుపోయాయో చూశారు కదా! మమ్మల్నిక వదిలేయండి" నిరాశ నిస్పృహలతో కుంగిపోయినవాడిలా అన్నాడు.

" అది కాదు సార్, ఇంత విలువైన ఆస్తిని ఎందుకు కొరగాకుండా వృథాగా ఉంచడంలో అర్థం లేదు." అన్నాడు బిల్డరు నిర్మోహమాటంగా రంగారావుని ఏదో విధంగా తనవైపు తిప్పుకోవాలని ప్రయత్నిస్తూ.

" అది మా సొంత విషయం. మీ జోక్యం మాకక్కర్లేదు. ఐకమత్యంతో మసలుకోవలసిన మా జీవితాలు వైషమ్యాలతో చిన్నాభిన్నం కావడం నేనుసహించలేను. మా ఆస్తి విలువ పెరిగేదే కాని తరిగేది కాదు. గోరంత ఆస్తి ఉన్న మాకు కొండంత అహంభామిందని అర్థమైంది. ఈ అవమానం చాలదా?" రంగారావు మాటల్లో ఆవేదన, బాధ, అసంతృప్తి

తన్నుకురావడంతో బిల్డరుకు నోటిమాట రాక ఖిన్నుడైపోయాడు.

ఈశ్వర్ కళ్లల్లో నిప్పులు పోసుకున్నవాడిలా మండిపడ్డాడు.

" మీ హితబోధలు ఇక ఆపి అసలు విషయానికి రండి. కాల యాపనతో పనులు జరగవు. ఈ రోజే ఇప్పుడే ఏదో తేలిపోవాలి.ఇంతవరకొచ్చాక నేనిక వెనుకాడేది లేదు " అంటూ ఈశ్వర్ విరుచుకుపడ్డాడు.

ఈశ్వర్ మాటలకి రంగారావు గుండె చురకత్తులతో చీల్చినట్లయింది. రక్తం నవనాడుల్లో పోటెత్తినట్లు ఊగిపోయాడు. తీవ్రమైన కంఠస్వరంతో ఈశ్వర్ అన్నయ్యపై ధ్వజమెత్తాడు.

" పెద్దవాడివి, రక్తసంబంధానికి విలువిస్తావనుకున్నాను. నీక్కాల్సింది ఆస్తులు అంతస్తులే గానీ ప్రేమ, అభిమానాలు, బంధుత్వంలో ఉన్న తీయదనం అక్కర్లేదు. అవి లేని ఈ ఓల్డ్‌హౌస్‌లో నువ్వుండగలవేమో గానీ నేనుండలేను.

నాకు మనషుల్లో మమత, మమకారం కావాలి గానీ క్షుద్రమైన ఆలోచనలు, అహంకారాలు కాదు. మీరున్నంతకాలం వుండి ఈ ఇల్లు యిలాగే ఉండనీ, అమ్మానాన్నల స్మృతి అంతవేగంగా చెరిగిపోకూడదు." అంటూ గద్గద స్వరంతో, రెండు కళ్ళల్లో కన్నీటిని నింపుకుంటూ ఓల్డ్‌హౌస్ డాక్యుమెంట్స్‌ని అన్నయ్య చేతిలోకి కుక్కి, విసురుగా ఒక్క ఉదుటున లోపలికెళ్తూ ఆగి నిశ్చేష్టంగా చూస్తున్న తన కుటుంబ సభ్యులతో అన్నాడు.

" భాగ్యం, రవి, రమ్యా పదండి. మనం వెళ్లిపోదాం. దృఢనిశ్చయంతో ఠీవిగా పలికాడు.

ఆ పలుకులకి బిల్డరు గతుక్కుమన్నాడు.

ఏదో జరగకూడనిది జరిగిపోతున్నట్లుగా కలవరపడ్డాడు బిల్డరు. అసిస్టెంట్ కాంట్రాక్టరుతో సహా.

అకస్మాత్తుగా బిల్డరు తన చోటు నుండి కదిలి రంగారావు దగ్గరకెళ్లి చేతులు పట్టుకున్నాడు. ఈ హఠాత్సంఘటనకి రంగారావు నివ్వెరపోయాడు. కోపాన్ని దిగమింగుకొని ప్రశ్నార్థకంగా! చూశాడు.

" క్షమించాలి రంగారావు గారు. మీకో నిజం చెప్పాలి" అంటూ సందిగ్ధంగా పలికాడు.

" చెప్పండి ఏమిటది?" – "ఇక్కడికి రాక ముందే మీ అన్నయ్యకు కలిసా"

" కలిస్తే..."

" వీలునామా గురించి తెలుసుకున్నాం"

" అయితే..."

" మీ మధ్య మనస్పర్థలు సృష్టిస్తే రెండు కుటుంబాలు విడిపోతే, అప్పుడు అతి తక్కువ డబ్బుతో ఈ ఇంటిని వశపరచుకోవచ్చు. మా పని సులువవుతుందనుకున్నాం. కానీ వ్యూహాలన్నీ తలక్రిందులయ్యాయి. మీరెంతో ఔదార్యంతో రక్తసంబంధానికి విలువనిస్తూ ఈ ఇంటిని అన్నయ్యకే అప్పజెపుతూ ఇల్లు విడిచి వెళ్లిపోతారనుకోలేదు. మీరు కలసి ఉంటేనే ఈ ఒప్పందం జరుగుతుంది. అయినా సమయం మించిపోయింది. బిల్డర్‌గా మా స్వార్థమే చూసుకున్నాం. మీ అనుబంధాలకి అడ్డుగోడలు కట్టాం గానీ అపార్ట్‌మెంట్స్ కట్టలేమని తెలిసింది. మరెప్పుడూ మీ జోలికి రాము. రెండు కుటుంబాలు కలిసి హాయిగా ఉండండి" అంటూ మరో మాటకి తావివ్వకుండా బిల్డరు, అసిస్టెంట్ కాంట్రాక్టర్ అవమానభారంతో తలవంచుకొని గుమ్మం దిగి వెళ్లిపోయారు.

రంగారావుతో పాటు అక్కడున్న వారంతా ఆశ్చర్యచకితులై, నిర్ఘాంతపోయి ఒకర్నొకరు చూసుకుంటూ జరిగినదానికి సిగ్గుపడుతూ చేతులు ముందుకు చాచి ఆప్యాయతకు, అనుబంధాలకు ఆహ్వానం పలికారు.

-ఆంధ్రభూమి, జనవరి, 2004

(వందేళ్లు వందమంది కథకులలో ఒక కథ)